# 'గులాబీ' జెండాను గుండెల్లో పెట్టుకున్నారు..


సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

- అచ్చంపేట ప్రజల రుణం తీర్చుకోలేనిది
- చివరిశ్వాస వరకు ఈ ప్రాంతసేవకే పనిచేస్తా
- లక్షమందితో సీఎం సభ నిర్వహిస్తాం
- ప్రతిపక్షాలకు కర్రుకాల్చి వాతపెట్టడం ఖాయం
- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు
- బీఆర్‌ఎస్ నాయకులతో సన్నాహక సమావేశం

అచ్చంపేట, అక్టోబర్ 22 : అచ్చంపేట ప్రజానీకం గులాబీ జెండాను గుండెల్లో పెట్టుకొని కాపాడుకుంటున్నారని, వారి రుణం తీర్చుకోలేదని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే డాక్టర్ గువ్వల బాలరాజు అన్నారు. ఈనెల 26న అచ్చంపేటలో సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభను లక్షమందితో నిర్వహించి అచ్చంపేట చరిత్రను తిరగరద్దామని పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలో తన నివాసంలో పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గువ్వల మాట్లాడుతూ అచ్చంపేట ప్రజలే నా ప్రాణమని, వారి సేవలోనే నా చివరి శ్వాస దాక సాగుతానని ప్రకటించారు. ముఖ్యంగా ఈ నెల 26న అచ్చంపేట పట్టణంలోని అటవీ శాఖ కార్యాలయ సమీపంలో సభను నిర్వహించనున్నట్లు తెలిపారు. కేసీఆర్ సభ ద్వారా హ్యాట్రిక్ విజయాన్ని అందుకుందామని వివరించారు. అచ్చంపేట నియోజకవర్గంలోని అన్ని మండల, గ్రామాల బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, అభిమానులు, యువకులు అందరూ సభకు హాజరై ప్రజా ఆశీర్వాద సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఇటీవల వస్తున్న సర్వే ఫలితాలు రాష్ట్రంలో మూడో సారి బీఆర్‌ఎస్ పార్టీ విజయఢంకా మోగిస్తుందని తెలియజేస్తున్నాయన్నారు. ఇటీవల పార్టీలో పదవులు పొంది, లబ్ధిపొందిన వారు వెళ్లినంతమాత్రనా వారి గురించి మాట్లాడాల్సిన అవసరం లేదన్నారు. ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు చేసినా అచ్చంపేటలో భారీ మెజార్టీతో గెలువబోతున్నామన్నారు. గెలిచిన తర్వాత మన పార్టీలోకి వచ్చే వారిని ఎట్టిపరిస్థితుల్లో ఇతరులను చేర్చుకోనని చెప్పారు. గ్రామాలు, పల్లెలో పార్టీబలంగా ఉందన్నారు. మ్యానిఫెస్టోను గడపగడపకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. నాయకులు, కార్తకర్తలు ఎవరి గ్రామాల్లో వారు బలంగా పనిచేస్తే గెలుపు మరింత సులువు అవుతుందని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ సభ ద్వారా గెలుపు నిర్ణయం జరుగుతుందని తర్వాత మెజార్టీ కోసం పనిచేయాల్సి ఉంటుందన్నారు. పేదలు, రైతులు, దళితులు, గిరిజనులు, మైనార్టీలు, మహిళలు సీఎం కేసీఆర్ వెంట ఉన్నారన్నారు. సీఎం సభకు ప్రతి మండలం నుంచి 15వేల మంది తగ్గకుండా తరలించాలని సూచించారు. 26న ఉదయం 11గంటల కన్నా అచ్చంపేట సభ ప్రాంగణానికి రావాల్సి ఉంటుందన్నారు. మొదటి రోజే సభ అచ్చంపేటలో ఉన్నందున అక్కడినుంచి మరో రెండు సభలకు సీఎం కేసీఆర్ వెళ్తారని గుర్తు చేశారు. అచ్చంపేట అభివృద్ధి కోసం సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లాల్సిన అనేక అంశాలను నివేదిక రూపంలో తయారు చేసి ఇవ్వడం జరుగుతుందన్నారు. లింగాల మండలం అంబట్‌పల్లి గ్రామాన్ని మండలంగా ప్రకటించాలని, కొన్ని నూతన గ్రామ పంచాయతీలు ఏర్పాటు, దళితబంధు యూని ట్లు, గృహలక్ష్మి, బీసీబంధు, మైనార్టీబంధు యూనిట్లు పెంచడం, పరిశ్రమల ఏర్పాటు, విద్యాలయాలు, మాడా రుణాలు పెంచడం తదితర అంశాలను సీఎం దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుందన్నారు. ప్రతిపక్షాలు చేస్తున్న గ్లోబల్ ప్రచారాన్ని పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. ప్రజలందరూ బీఆర్‌ఎస్‌వైపే ఉన్నారని అన్నారు. చేసిన అభివృద్ధి పనులు చేయాల్సిన వాటి గురించి ప్రజలకు వివరించాలని చెప్పారు. ఒక్కసారి గెలిచిన పాపానికి వారి ఆగడాలు చూసిన ప్రజలు మళ్లీ గుండాయిజం, రౌడీయిజం, దోపిడీపాలన వస్తుందనే భయంతో ఉన్నారని అన్నారు. ప్రశాంతంగా ఉన్న అచ్చంపేటను ఆగం చేసేందుకు దోపిడీదారులందరూ ఒక్కటై నన్ను ఓడించేందుకు కుట్రలు చేస్తున్నారని అన్నారు. బీఆర్‌ఎస్ సైన్యం ముందు వారి కుట్రలు, ఆగడాలు పనిచేయవని స్పష్టం చేశారు. గతసారే గెలిచామని ఫలితాలు రాకముందే సంబురాలు నిర్వహించిన ప్రతిపక్షాలకు అచ్చంపేట ప్రజలు కర్రుకాల్చి వాతపెట్టారని గుర్తు చేశారు. ఈసారి కూడా ప్రతిపక్షాలకు అలాంటి గుణపాఠం పునరావృ త్తం కాక తప్పదన్నారు. సమావేశంలో రైతుబంధు సమి తి జిల్లా అధ్యక్షుడు మనోహర్, మార్కెట్ చైర్‌పర్సన్ అరుణ, మున్సిపల్ చైర్మన్ నరసింహాగౌడ్, మండలాల బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు రవీందర్‌రెడ్డి, రవీందర్‌రావు, జగపతి, పర్వతాలు, కృష్ణారెడ్డి, తిర్పతయ్య, సుధీర్‌గౌడ్, ఎంపీపీ అరుణ, జెడ్పీటీసీ రాంబాబు, సింగిల్ విండో చైర్మన్లు నర్సయ్యయాదవ్, భూపాల్‌రావు, గురువయ్యగౌడ్, హన్మంతురెడ్డి, లాలుయాదవ్, అమినోద్దిన్, నాగయ్యగౌడ్, బంగారు నర్సింహ, తులసీరాం, పులిజాల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

### బీఆర్‌ఎస్‌లో చేరిన నాయకులు

అచ్చంపేట/బల్మూర్, అక్టోబర్ 22 : ఇంతకాలం బీఆర్‌ఎస్‌లో ఉండి లబ్ధిపొంది తీరా ఇప్పుడు ఇతర పార్టీలోకి వెళ్లిన వారి నుంచి పార్టీకి శని విరగడైందని ఉప్పునుంతల, అమ్రాబాద్ మండల పార్టీ అధ్యక్షులు రవీందర్‌రావు, రవీందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం అచ్చంపేటలో ఉప్పునుంతల మండలం పెనిమిళ్ల గ్రామానికి చెందిన ఎరుకల సామాజిక వర్గానికి చెందిన 15మందితో పాటు ఇతరులు ఎమ్మెల్యే గువ్వల బాలరాజు సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. అదేవిధంగా బల్మూర్‌కు చెందిన కురుమ సంఘం నాయలు కూడా ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు.

### సీఎం సభా ప్రాంగణం పరిశీలన

అచ్చంపేటటౌన్, అక్టోబర్ 22 : ఈ నెల 26న సీఎం కేసీఆర్ అచ్చంపేటకు రానున్న సందర్భంగా నిర్వహించే బహిరంగసభా ప్రాంగణాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా గువ్వల మాట్లాడుతూ సీఎం పర్యటన పురస్కరించుకొని కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నామని, సభా ప్రాంగణంలో 60 వేల మందికి పైగా హాజరయ్యే ప్రజల కోసం అన్ని వసతులు కల్పిస్తున్నామన్నారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నేతలు ఉన్నారు.


కాంగ్రెస్ కార్యకర్తలను బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

# సంక్షేమ పథకాలకు ఆకర్షితులై..

- కాంగ్రెస్ పాలనలో ప్రజలకు ఒరిగిందేమీలేదు
- కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్
- బీఆర్‌ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు

కడ్తాల్, అక్టోబర్ 22 : ముఖ్యమంత్రి కేసీఆర్ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన కార్యకర్తలు బీఆర్‌ఎస్ పార్టీలో చేరుతున్నారని బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో, కడ్తాల్ గ్రామానికి చెందిన వరికుప్పల రాంచరణ్, అనిల్, మహేశ్, రవి, రేణు, నరేశ్‌తోపాటు మరో 20 మంది కాంగ్రెస్ కార్యకర్తలు ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే గులాబీ కండవాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పార్టీతోనే అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని తెలిపారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్న సీఎం కేసీఆర్‌కి యువత అండగా నిలబడాలని కోరారు. కాంగ్రెస్ పాలనలో పేద ప్రజలకు ఒరిగిందేమీలేదని విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో అన్ని కుంభకోణాలే జరిగాయని గుర్తు చేశారు. అమలుకి సాధ్యం కానీ హామీలను ప్రకటిస్తున్న కాంగ్రెస్ నాయకులకు వచ్చే ఎన్నికల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని వివరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, వైస్ ఎంపీపీ ఆనంద్, సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, ఉప సర్పంచ్ రామకృష్ణ, రైతుబంధు సమితి గ్రామాధ్యక్షుడు వెంకటేశ్, నాయకులు నర్సింహ, గంప శ్రీను, లాయక్‌అలీ, మహేశ్, భిక్షపతి, గణేశ్, అశోక్, రామచంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

# మహాగౌరీ..శ్రీ శైలవాసినీ

- నందివాహనంపై మల్లన్న


మహాగౌరీగా దర్శనమిచ్చిన భ్రామరి

శ్రీశైలం, అక్టోబర్ 22 : శ్రీశైల మహా క్షేత్రంలో దసరా మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఎనిమిదో రోజు దుర్గాష్టమి సందర్భంగా ఆదివారం భ్రామరీ అమ్మవారిని మహాగౌరి రూపంలో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఈవో పెద్దిరాజు తెలిపారు. నందిని వాహనంగా చేసుకొని నాలుగు చేతుల్లో వర, అభయ ముద్రలతోపాటు త్రిశూలం, ఢమరుకాన్ని ఆయుధాలగా ధరించి దివ్యకాంతులను ప్రసరింపజేస్తు తెల్లని రంగులో శాంతస్వరూపిణిగా భక్తులకు అమ్మవారు దర్శనమిచ్చింది. సాయం త్రం అక్క మహాదేవి అలంకారమండపంలో నందివాహనంపై ఆసీనులైన శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామిఅమ్మవార్లకు రుత్వికులచే శాస్త్రోక్త పూజలు జరిపించినట్లు ఈవో తెలిపారు. ఆలయ ప్రాకారోత్సవంతో పాటు క్షేత్రపురవీధుల్లో నందివాహనాధీశులైన స్వామి అమ్మవార్లకు గ్రామోత్సవం జరిపించారు. ఆలయ ప్రధాన గోపురం నుంచి నందిమండపం మీదుగా బయలువీరభద్రస్వామి ఆలయం వరకు ఉత్సవం కనులపండువగా సాగింది.

### మహాగౌరీ అవతారంలో జోగుళాంబ

అలంపూర్, అక్టోబర్ 22 : శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా ఎనిమిదో రోజు జోగుళాంబ అమ్మవారు సోమవారం మహాగౌరీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవాల సందర్భంగా ఆలయంలో విశేష పూజలు కొనసాగాయి. యాగశాలలో ఆవాహిత దేవతలకు మండపారాధన, శోడషోపచార ప్రాతఃకాల పూజలు, నిత్యానుష్టాన ఆవాహిత దేవతాహోమాలు నిర్వహించారు. ఉదయం 9గంటలకు రథాంగ హోమం, 10 గంటలకు అమ్మవారు రథంపై ఊరేగారు. సాయంత్రం ఆరుగంటలకు మహా మంగళహారతి ఇచ్చారు. గర్భాలయం ఎదుట ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంలో జోగుళాంబ దేవిని మహాగౌరిగా అలంకరించి ఆరాధించారు. ఈ సందర్భంగా సినీ హీరో శ్రీకాంత్, హైకోర్టు రిజిస్ట్రార్ నర్సింగరావు, స్థానిక కోర్టు జడ్జి కమాలాపురం కవిత తదితరులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. వారికి ఆలయ కమిటీ చైర్మన్ చిన్న కృష్ణయ్యనాయుడు, ఈవో పురేందర్‌కుమార్, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి పూజల అనంతరం ఆశీర్వచనం పలికారు.

MBA/B.Ed
Seats are available with or without entrance
SHADNAGAR
9866958815
9392639172

# ప్రజల ఆకాంక్షలకు అద్దం పట్టేలా మ్యానిఫెస్టో

- సంక్షేమంలో తెలంగాణ నెంబర్‌వన్
- అభివృద్ధిని చూసి ఆదరించండి
- బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి
- బీఆర్‌ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు


బీఆర్‌ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులతో ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

పాన్‌గల్, అక్టోబర్ 22 : బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టో ప్రజల ఆకాంక్షలకు అద్దంపట్టేలా ఉందని, సబ్బండ వర్గాలకు కొండంత అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనానికి ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సంపద పెంచి పేదలకు పంచడమే బీఆర్‌ఎస్ సర్కారు విధానమని, గడిచిన పదేండ్ల పాలనలో తమ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే నిదర్శనమని తెలిపారు. ప్రజాహితం కోరి సీఎం కేసీఆర్ రైతుబంధు ఎకరానికి రూ.16వేలు, సౌభాగ్యలక్ష్మి పేరుతో బీపీఎల్ కుటుంబాలకు చెందిన పేదమహిళలకు నెలకు రూ.3వేలు, రూ.400లకే వంటగ్యాస్ సిలిండర్, జర్నలిస్టులకు వైద్య బీమా, రేషన్ సన్నబియ్యం, ఆసరా పెన్షన్ల పెంపు రూ.5016, అసైన్డ్ భూములపై ఆంక్షలు ఎత్తివేత తదితర ఎన్నో సంక్షేమ పథకాలు మ్యానిఫెస్టోలో పొందుపర్చారని తెలిపారు. నియోజకవర్గంలో తాను ఎంతో అభివృద్ధి చేశానని, మరింత అభివృద్ధి చేసేందుకు మరోసారి తనను ఆశీర్వదించాలని కోరారు. ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేసి ప్రతి మండలం నుంచి 5వేల మెజార్టీ తీసుకరావాలని పిలుపునిచ్చారు. మాజీమంత్రి జూపల్లి మాయమాటలు చెప్పి ఓట్లు దండుకోవడానికి ప్రజలు ముందుకు వస్తున్నారని, ప్రజలను చైతన్యవంతులను చేయాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ దళారుల చేతుల్లోకి వెళ్లిపోయిందని ఎమ్మెల్యే విమర్శించారు. కర్ణాటక మోడల్ పేరుతో ప్రజలను మభ్యపెడుతుందన్నారు. చిన్నంబాయి మండలంలో రామలింగేశ్వర టెంపుల్ భూములను మాజీమంత్రి జూపల్లి కాజేసి, బ్యాంకులకు తాకట్టు పెట్టారని ఆరోపించారు. మండలంలోని కిష్టాపూర్ గ్రామంలో రామన్నగుట్టు రిజర్వాయర్ నిర్మాణ పనులు త్వరలో చేపడతామని తెలిపారు. అనంతరం తెల్లరాళ్లపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలేశ్ ఎమ్మెల్యే బీరం సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. సమావేశంలో ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షులు రాముయాదవ్, రైతుబంధు మండల కన్వీనర్ వెంకటయ్యానాయుడు, మాజీ జెడ్పీటీసీ రామ్మూర్తినాయుడు, బీఆర్‌ఎస్ నా యకులు అభిలాష్‌రావు, చంద్రశేఖర్‌నాయక్, ఠాకూర్‌నాయక్, రఘుపతినాయుడు, ఎంపీటీసీలు భాస్కర్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, సింగిల్‌విండో వైస్ చైర్మన్ బాలయ్య, సర్పంచులు వెంకటయ్య యాదవ్, నాగేశ్ తదితరులు పాల్గొన్నారు.

### బీఆర్‌ఎస్‌లో చేరిన నేతలు

పెద్దకొత్తపల్లి, అక్టోబర్ 22 : మండలంలోని మారేడుమాన్‌దిన్నె గ్రామంలో 6వ వార్డు సభ్యురాలు బేబీ సీతారాంనాయక్‌తోపాటు 50 మంది కార్యకర్తలు ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో సర్పంచ్ సునీతోపాటు శ్రీకృష్ణ ఆచారి పలువురు నాయకులు ఉన్నారు.